
తండ్రికి బాగులేదన్న టెలిగ్రాం భార్య అందించగానే నెయ్యబారి నట్టయి పోయాడు భాస్కరం.

"ముందన్నట్టుగా మంచినీళ్ళు తీసుకోండి - ఏం చెయ్యాలి ఆలోచిద్దాం-" అలా అంటునప్పుడు వసంత ఆవులించింది. తీసుకొచ్చిన మంచినీళ్ళ గ్లాసుని టీపాయ్‌మీద ఉంచింది అంతా గమనిస్తున్న భాస్కరం జవాబివ్వలేదు.



"-బావుందండీ ... వరస ...! మనుషులన్నాక జబ్బులు రావా! తగ్గవా! మీరిలా బెంబేలుపడిపోతే మీ అమ్మగారు యింకెంత యిదయిపోతారు---" వసంత మాటలాడుతూనే బూట్లు విప్పింది. సాక్సుని వాటిని పట్టుకెళ్ళి జాగ్రత్త చేసింది. ఆమె తిరిగి వచ్చేసరికి మంచినీళ్ళు తాగాడు. ఇన్‌షర్ట్‌ని బయటకు తీసాడు. వసంత రాగానే అంతవరకూ తనని నలిపేస్తున్న ఆలోచనలను బయటపెట్టటానికి ప్రయత్నం చేసాడు.

"-శలవు ... దొంగముండాకొడుకు ఆఫీసు .. వాడి బాబు ముల్లెలాగ లీవు యిమ్మంటే ఘోరుమని ఏడుపు! మీదపడి కరిచేయటం --! తండ్రి చస్తున్నాడురా - అంటే తద్దినానికి వెళ్ళొచ్చనే రకాలు చఛా..

వసంతతోబాటే వంటగదిలో తిరిగాడు భాస్కరం. టీ తయారయేదాకా ఆమె మాట్లాడలేదు. కప్పుల్లో పోస్తూండగా—

"డబ్బులు పట్టుకెళ్ళాలి గామోల" అన్నాడు అదోలా.

"కామోలు ఏంటండీ--! తప్పకుండా పట్టుకెళ్ళాలి..! ఎక్కడయినా చూడండి"

"ఎంత కావాలంటావ్ -?" టీ సిప్ చేసి అడిగాడు.

"అందాకా ఎంతోకొంత తీసుకెళ్ళండి. ఆయన్ని యిక్కడికి తీసుకువస్తే నలుగుర్లోనూ మర్యాదగా ఉంటుంది. మంచి వైద్యమూ దొరుకుతుంది."

ఆమాట భాస్కరానికి మింగుడు పడలేదు. ఇబ్బందిగా కదులుతూ



'మర్యాదకోసం చేస్తామా..అభిమానంకోసం చేస్తాంగాని--"

"పోనీ మర్యాదాకాదు .. అభిమానమే! అన్నీ ఆచితూచి మాటలాడటానికి నేనేమయినా వేదాంతాలు చదివానా వేదాలు చదివానా--!"

వేదాలూ వేదాంతాలు చదివితే సరిగ్గా మాట్లాట్టం వస్తుందా అని ప్రశ్నిద్దామనుకున్నాడు భాస్కరం. అడగక పోవటానికి

కారణం పరిస్థితి తాలూకు దుర్ధాయేగాని భార్య గురించి ఆలోచన కాదు.

అతని కంటిముందు మంచాన్ని అంటిపెట్టుకున్న తండ్రి గ్రగస్తవదనం నిలవటం లేదు. కుర్చీలో కూర్చున్న ఆఫీసరు మొహామే గుర్తు వస్తోంది. ఊపిరి ఆడటంలేదు.

-దరిద్రుడు .. మాన త్వం లేదు .. శలవడిగితే పదిరోజుల పని పూర్తిచేసి వెళ్ళమంటాడు--! జై జనయం..! బానిసత్వం నయం..! బాస్టర్డ్! రాజులు పోయారు. రాజ్యాలు పోయాయి. రాజరికాలు పోలేదు. యజమానులు పోలేదు. బానిసలు పోలేదు--! నాతండ్రికన్న .. నాకన్న తండ్రి కన్న-- తెల్ల కాగితాలను నల్లబరచటం ముఖ్యమా..! ఉన్న లీవుకన్న ఒక్కరోజు ఎక్కువ యివ్వలేని బాల్డీగాడు ఎలాగైనా లీవుని వేస్టు చేయించాలని చూస్తాడు. యింతకన్న సెంట్రల్ సర్వీసు నయమేమో ---

"--ఏంటాలోచిస్తున్నరూ..?" వసంత టీగ్లాసు అందుకుంది.

ఆమెవయిపు చూస్తూ హఠాత్తుగా అన్నాడు.

"అవునూ! నువ్వు బయల్దేరవూ-?"

"నేనూ అదే అనుకుంటున్నాను. ఏ తన్ను చూస్తే ఆ తన్నే గొడవలు మొన్నటికి మొన్న బాబిగాడు చచ్చేటంత జబ్బు పడ్డాడు. పదిహేను రోజులు స్కూలు పోయింది. పోనీ యింటిదగ్గర కూర్చోబెట్టి చదివిద్దామంటే హాజరుపాను-- ఎప్పుడూ రోగమే! ఏటికేడాది చదువూ ఆహాజరు లేకపోతే గంగలో కలిసిపోవాల్సిందే--"

"--నువ్వు బంయల్దేరటం లేదంటావ్--"

"అలా అనటానికి మనసొప్పటం లేదండీ-- అక్కడ పరిస్థితి పూర్తిగా తెలీదు -- ఓమారు యిద్దరం కలిసి వెళ్ళాం.. ఓ మారు మీరొక్కరూ వెళ్ళారు.. యీసారి టెలిగ్రాం--! ఏంటో-! టయిముకి అందుకోలేదన్న మాటా వస్తుంది నాకు-! దిక్కుమాలిన పట్నం బతుకులు! అభిమానాలూ ఆప్యాయతలూ చంపేసుకొని శవాల్లా ఉండాలి--"

" -- "

"మీరు నన్ను నమ్మరన కోండి! ఆ ముసలాయన నాకేం అపకారం చేసారు? నాకెందుకుంటుందీ కోపం? మానాన్నకే యిలాంటి పరిస్థితి వచ్చినా యీగొడవలన్నీ ఉండవే --!"

"--అయితే -- ఎవరో ఏదో అంటారనే -- ఎందుకో ఆలోచన?"

"అత్తింటి కోడలెవరయినా ఆలోచించేది మాటలంటారనే--!" మీరు వెళ్ళిపోతే కుదరలేదనో కోడలు పీనుగ రానీలేదనో అనుకుంటారు! నేను వెళ్ళిపోతే యిష్టంలేదూ రాలేదూ అంటారు -"

"మావాళ్ళు అలాంటివాళ్ళు కాదు వసంతా--"

"ఎవరివాళ్ళూ అలాంటివాళ్ళు కాదు అలాఅనుకోటంలో చిత్రమేంలేదు-! అది లోకసహజం--! ఆగొడవలకేం లెండి - మంచీ చెడ్డా మీవి? బయల్దేరవే అంటే బయలుదేరతాను -- నాదేముంది?"

"అలా అనెయ్యకు వసంతా--! యిద్దరం ఆలోచించుకోవాలిగాని -- నాదేవన న్నొదిలేస్తే యిలాంటప్పుడు నేనేమయి పోవాలి --!"

వసంత వెంటనే మాట్లాడలేదు. తలవంచుకొని ఉండిపోయింది.

కొంచెం నెమ్మదిగా అంది -

"డబ్బుకి డబ్బూ అవుతుంది. పిల్లడి చదువూ చెడుతుంది. మాటకేముంది లెండి? యిలావుంటే అలా లేదంటారు -- అలావుంటే యిలా లేదంటారు --! ఓపని చెయ్యండి --" తలపైకెత్తి చూసింది. భాస్కరం కళ్ళు బాధతో వర్షించే మేఘాల్లా ఉన్నాయి. అతని తలని దగ్గరకు తీస్కుని గుండెలకి హత్తుకుంటూ -

"ఏంటండీ యిది..! ఆయనకేమీ అవదు. నిక్షేపంలా ఉంటారు. మనవడి పెళ్ళి చేయిస్తారు. అంతగా అయితే తీసుకువచ్చేయండి--! శుభ్రమయిన డాక్టర్‌కి చూపించుదాం--!"

భాస్కరంకి ఆమె సానుభూతిని అందుకుంటున్న స్పృహలేదు. హృదయపు పైభాగాన్ని మెత్తబరుస్తున్న ఆమె మాటలు లోలోపలికి జొరబడి మరణం గూర్చి ప్రశ్నలను కదుపుతున్నాయి. ఆ ప్రశ్నల మధ్యనుంచి ఆఫీసూ -- డబ్బులు పుట్టించటం -- భార్యని తాను తనవాళ్ళ విషయంలో పూర్తిగా నమ్మలేకపోడం -- పిల్లల చదువులూ -- పట్నం బతుకుల్లో కాలమూ దూరమూ .. వస్తూపోతూ ఉన్నాయి.

వసంత ఉండిపోటానికి అవసరాన్ని బట్టి భాస్కరం టెలిగ్రాం యివ్వటానికీ నిశ్చయించుకున్నారు. డబ్బు తేటానికి యిద్దరూ ఒప్పుకున్నారు. రాఘవద్వారా ఎంత దొరికితే అంత సంపాదిద్దాం - అన్నాడు భాస్కరం..

ఆమాటకి వసంత అడ్డుపడింది.

"-ఎంత దొరికితే అంత..! ఓలక్ష యిప్పించగలడాయన. తెచ్చుకుంటామా?" అంది.

వాస్తవదూరం కాని కాఠిన్యత ఆగొంతులోంచి భాస్కరానికి గట్టిగానే గుచ్చుకుంది. అయినా అదోలా నవ్వాడు.

"లక్ష..! వాడు యిప్పించగలడే అనుకో.. మనకేముందని యిస్తారే ఎవరయినా?"

"ఓవేళ యిచ్చేవాడే ఉన్నాడను కోండి -- అప్పుడూ--?"

తోకతొక్కిన తాచులా లేచాడు భాస్కరం.

"తెస్తానే..తప్పకుండా తెస్తానే --! కన్నతండ్రి అటోయిటోగాఉంటే--అటు శక్తికిమించినా బరువు ఎత్తుకోవాలే--! వెధవ కొడుకుని కనిపెంచి యీశరీరాన్ని యింతజేసి యిన్ని కష్టాలూపడి-- ఏఆడదానికో అప్పగించేసి -- వళ్ళుగర గరుచుకుని పడుకోవాలా -- యింకెందుకే ఎందుకే వెధవకొడుకు -- ఉండేం! ఊడేం--?"

అతనంత తొందరగా ఉద్రేకపడి పోడం-- ఉద్రేకంలో మాటలు తడబడటం-- ఆమెకి కొత్తగాదుగాని అది ఎప్పటికప్పుడు కొత్తగానే ఉంటుంది. అలాంటి ఉద్రేకంలో అతన్ని చూసేక ఆమెకు తన శరీరంమీద దుస్సహమ్మయిన రోతకలుగుతుంది.

ఉండి
విపిన. మూర్తి
కథ

అతని స్వవిషయాలలో -- ముఖ్యంగా తలిదండ్రుల పట్ల నిర్వర్తించవలసిన విధుల విషయంలో-- అవ్యక్తి-- ఏవ్యక్తి కడుపు నిండకపోతే తనకడుపు ఎండినట్లు అనిపిస్తుందో ఆవ్యక్తి-- ఏవ్యక్తి ముఖంమీద చిరునవ్వు మాయమైతే తన బ్రతుకులో చీకట్లు చుట్టిముట్టినట్లవుతుందో అవ్యక్తి-- ఏవ్యక్తి సంతోషపూర్వక హాస సంకాశంతో తన వదనమూ తన నయనాలూ వెలుగుతాయో అవ్యక్తి-- అవ్యక్తి ఏనాడయినా తనని దగ్గరకి తీసు-కోగలడా--? అలా తీసుకోలేక పోటానికి కారణం కేవలమూ అతనేనా? తనలో మాత్రం ఏదో వెరుసుభావం లేదా? ఆ వెరుసుభావం తన బుద్ధితో తన శక్తితో పుట్టినదా? ఆవెరుసుభావం తన బుద్ధితో తన శక్తితో తొలగింపబడగలదా? ఉన్న కొద్దిపాటి ఆర్థిక వనరులతోనా గత బంధాలకు పూర్తిగా కట్టుబడిపోయి భవిష్యత్తు బంధాలకు తిలోదకాలు యివ్వాలా? గత బంధాలకు అన్యాయం చేసి భవిష్యత్తుకు పూర్తిగా అంకితమవ్వాలా? తలిదండ్రులా-పిల్లలా? రెండు బంధాలకూ న్యాయం చేయటానికి ఆర్థికవనరులు చాలవన్నది ఓసాకా? వాస్తవమా అది వాస్తవమే అయితే తన కడుపును చీల్చుకొని వచ్చిన చిన్నిచిన్ని నోళ్ళూ బొజ్జలూ నిండాలనీ- వాళ్ళ ఒంటినిండా బట్టలు అమరాలనీ- వాళ్ళ చదువుకు చక్కని సదుపాయాలు కుదాలనీ- వాళ్ళ భవిష్యత్తు భద్రంగా ఉండాలనీ- తాను ప్రయత్నించటం తప్పా? ఆ ప్రయత్నం పక్షపాతమేఅయినా- గర్హించవలసిన పరిహరించవలసిన తప్పా? వాస్తవానికి తాను అతనికి సలహా యివ్వ గలదూ- తనబాధ వెలిబుచ్చుకోగలదూ- గోల చేయగలదూ- అంతేగాని అతన్ని తన ధర్మాన్నుండి మరల్చగలదా? అతనికి మాత్రం బిడ్డలపట్ల ఉండదా? ఉండిఉంటే--

తనతలిదండ్రులకేదో అన్యాయం జరిగి పోతున్నట్లు ఎందుకంత ఉద్రేకం? తను సంపాదించిన ధనం -- తనమీద బలంగా వున్న అనుబంధాలకు స్వేచ్ఛగా ఖర్చుపెట్టలేక పోతున్నందుకా ఆ ఉద్రేకం? అంటే తను అతని స్వేచ్ఛకు ఆటంకమా? అందుకోసం తనయీ రొమ్ముల్ని యీ పడక సుఖాన్ని యీ శరీరాన్ని యీ ప్రేమానుభూతుల ప్రదర్శననీ ఉపయోగిస్తున్నదా..? -

యింత స్పష్టంగా వసంత ఆలోచించలేకపోయినా - అతను అలా ఉద్రేకాన్ని ప్రదర్శిస్తున్నపుడు - ఆవిడ శరీరం కుంచించుకుపోతూ లోనయే రోతవెనక యిలాంటి ప్రశ్నలూ అవి రేపే అనుభూతి ఉంటూనే ఉంటాయి.

భర్త మాటల్ని వింటూ వసంత జవాబివ్వలేదు.

స్లిప్పర్స్ వేసుకుని భాస్కరం గబగబా బయటకి వెళ్ళిపోయాడు.

పిల్లలు వచ్చారు. కాస్సేపు చదివారు. అన్నం అన్నం అంటూ గొడవ మొదలు పెట్టారు. బలవంతాన లేచింది వసంత. అన్నాలకంచాలు వాళ్ళ ముందుంచింది. వాళ్ళు రోజూలాగే తిట్టుకుంటున్నారు. కొట్టుకుంటున్నారు. పితూరీలు చెప్పుకుంటున్నారు.

వసంత వెళ్ళి బాత్‌రూం తలుపు మూసుకుంది.

అన్నం అయిపోయింది. పిల్ల 'అన్నం అన్నం' అంటూ గోల.

ఆమె బయటకువచ్చి చీరకొంగుతో మొహం తుడుచుకుంది. పిల్లలు వింతగా నోరువెళ్ళబెట్టుకుని అమ్మను చూస్తున్నారు.

ఆమె చటుక్కున వచ్చి వాళ్ళిద్దరినీ ముద్దులతో ముంచెత్తింది.


2

విడువలేక విడువలేక విడుస్తున్నట్లు కదిలింది రైలు.

ఊగుతున్న చేతులతో రైలూ ప్లాట్‌ఫారమూ విడిపోయాయి. యిళ్ళూ ఎలక్ట్రిక్ స్తంభాలు చేలూ చీల్చుకుంటూ రైలు వేగం పెంచుకోజూస్తోంది. ఆకాశం ప్రశాంతంగా ఉంది. సర్వమూ శూన్యంలోకి కలిసిపోతున్నట్లుంది.

భాస్కరం రైల్లోంచి చూస్తున్నాడు.

అతని మనసునిండా వసంతే! ఆమె కన్నీళ్ళే! రైలు చాలావేగంగా తనను ఆమెనించి దూరంచేస్తున్నట్లనిపిస్తోంది. చివరికి ఆమె చెప్పినట్లే చేసాడు. అయిదువందలు తెచ్చాడు. రెండు పట్టుకున్నాడు. మూడు వసంతదగ్గర ఉంచాడు. తను పరిస్థితి చూసి టెలిగ్రాం యిస్తాడు. ఆమూడూ తీసుకుని తనగొలుసు తీసుకుని ఆమె బయలుదేరాలి. అంతా ఆమె ఉద్దేశప్రకారమే జరుగుతోందని ఆమె ఒప్పుకోకపోయినా తాను అలాగే అనుకుంటున్నాడు. ఏమయినా తాను అంత కఠినంగా వ్యవహరించడం సరిగాదు. ఆమె తన బాధ్యతలను విస్మరింపజేయలేదే! తనవన్నీ అనవసర భయాలేమో! ఆఖరికి ఆఫీసరు దగ్గరకి రాజీనామా కాగితాన్ని జేబులో పెట్టుకుని వెళ్ళడమూ భయమేనేమో! ఆచర్య తండ్రిమీద ప్రేమకు నిదర్శనమా? ఆఫీసరుపట్ల వ్యగ్రతకు తార్కాణమా? అవాస్తవిక ఆలోచనలకు ప్రతిబింబమా? ఆఫీసరు అంతవెంటనే శలవు యిచ్చి ఉండకపోతే తాను రాజీనామా అందజేయగలిగి ఉండేవాడా? ఆకుర్చీ అతనిని ఫీలింగ్స్‌ని గుర్తించలేని కర్కశుడిగా మార్చిందా? అనేకరకాల దొంగకారణాలు



ఎనివని/అసలు కారణాలు నమ్మటంలేదా? సెలవుని హక్కుగా గుర్తించని ప్రభుత్వం అంతర్యమేమిటి? శలవు దుర్వినియోగ మవుతుందనా? యిప్పుడు కావటంలేదా? ఓ అంతస్తు ఉద్యోగిని పైఅంతస్తువాడికి లొంగి ఉంచాల్సిన అవసరమా! ఏదయినా అధికారికీ స్టాఫ్‌కీ మధ్య సరళమయిన మానవానుబంధాలు తెగిపోవటానికే యీవిషయం వినియోగపడుతోంది.

"-ఎందాకా బాబూ?"

భాస్కరం తలతిప్పాడు ముసిలాయన! తండ్రివయసే ఉంటుంది. బలహీనంగా ఉన్నాడు. - భాస్కరం చెప్పాడు.

"అత్తవారింటికా..?" అడిగాడాయన.

షాక్ తిన్నట్టు చూసాడు భాస్కరం.

"ఏం బాబా అలా అయిపోయావ్.."

కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి.

ఎందుకింత దుఃఖం? - అతనికి వెంటనే బోధపడలేదు. ఒంట్లోబాగోని .. బహుశా కిందకి దింపేసిన కన్న తండ్రిని చూడటాన్కి వెళ్తున్నాడు తను. అలాంటి తనమొహం అత్తారింటికి వెళ్తున్నంత హుషారుగా ఉందా? అయినా అత్తారింటికి వెళ్ళడం..

"ఏం లేదండి--"


ముసిలాయన చిన్నగ నవ్వి పేపరు తీసుకున్నాడు. అందులో మునిగిపోయాడు. అంతే.. అంతే..! అతనికీ తనకి సంబంధం -- పేపరు సంబంధం! అందుకోసం పల్కరించాడు. అందుకోసం సానుభూతిగా ఓప్రశ్న వేశాడు. పేపరు అందగానే - అవసరం తీరిపోగానే - తనవేదనకు కారణం అతనికి అక్కరలేక పోయింది. కేవలమూ ఓ చిన్ని పనికోసం--, కాస్తంత సానుభూతి! అది పుట్టించబడిన సానుభూతి! కల్పితం! తండ్రికీ తనకీ మధ్యనున్నది--? తండ్రికి తనపై దున్నది? కల్పితభావం. నీకొడుకు అని చెబుతుంది భార్య. నీకొడుకు నిన్ను నరకంనుంచి తప్పిస్తాడంటుంది మతం. నీకొడుకు వృద్ధాప్యంలో నిన్ను ఆదుకుంటాడంటుంది సమాజం. నీకొడుకు నువ్వు నమ్మిన మత విశ్వాసాలనూ ఆశయాలనూ కొనసాగిస్తాడంటుంది హృదయం. ఇన్ని రకాల మాటలవల్ల ఓఅనుబంధం పుడుతుంది. అది పుట్టించబడిన అనుబంధం. తల్లిది తప్ప .. తండ్రిదీ బిడ్డదీ కల్పితాను బంధమే! కల్పితమే అయినా అంతబలంగా తన హృదయాన్ని ప్రభావితం చేసి కన్నీరు కార్పించగలుగుతున్నపుడు ఏరకంగా సహజమైన అనుబంధం కన్న తక్కువ స్థాయిదీ? యిదీ మానవసమాజంలో ఓ విచిత్రం.. విషయ నిర్ధారణలో సహజమయిన మాతృబంధంకన్న కల్పితమయిన పితృబంధానికే ప్రాధాన్యత. అంతకన్న కల్పితమయినది భార్యతో బంధం. అదే విషయ నిర్ధారణలో ఎక్కువ ప్రాధాన్యత వహించటంలేదా? ఎందువల్ల? బహుశా కల్పితమయిన ఆస్తిహక్కు వల్లనే కల్పితానుబంధాలకు ప్రాధాన్యత పెరిగిందేమో! యీ ముసిలాయనకి తన మొహంలో ఏం కనిపించినా దుఃఖపడాల్సిన పనేముంది - అంతా కల్పితమే అయిపోయినపుడు?

భాస్కరం గుండె ఎండిపోయి నట్టయింది.

యీప్రపంచములోని అనుబంధాలన్నీ యింత కల్పితంగా అనిపించేసరికి ... అతని హృదయం అందుకు అంగీకరించటానికి మొరాయించసాగింది. అతనికళ్ళముందు తండ్రి మొహం నిలిచింది ఆబొమ్మ స్థిరంగా ఉండటం లేదు. పట్టుకి దొరకటంలేదు. ఎంతగా కదిలిపోతున్నా అందులో తండ్రి పోలికలు కొట్టొచ్చినట్టున్నాయి. అందులో విచార ముద్ర చెరగటం లేదు. "-నాప్రేమ కల్పితమంటావా నాయనా?" అంటూ ప్రశ్నిస్తున్నట్లుంది.

ఏదో ఓ యీతచెట్టు తనజ్ఞాపకాలలో ఉంది. ఆరేడేళ్ళ వయసు తనకి. ఏదో ఊరు వెళ్ళారు తనూ ఆయన. అక్కడ ఏదో కోరాడు తను. కొన్నాడో -- చాలినంత కొనలేదో -- గుర్తురావటం లేదు. తండ్రిమీద కోపం వచ్చేసింది. భుజంమీంచి దిగిపోయి ముందుకు నడిచాడుట. ఆయన వెనక్కి రాకపోతే చచ్చిపోతానని బెదిరించాడట. అలా వెళ్ళి యీతచెట్టుకింద తలగుడ్డ ఒత్తుపెట్టుకుని నటించాడట. అప్పుడు తనకి భయమే వేసిందిట గాని బాధరాలేదట. దూరందగా ఉంది పోయి ఏదోకుక్క దగ్గరికి వచ్చేపరికి ఏడ్చాడట. - రాయంటి బిడ్డా వెన్నంటి తండ్రీ - అంటూ అపుడపుడు యీకథచెప్పి నవ్వేవాడాయన.

నవ్వొచ్చింది భాస్కరంకి - నిజమే మరి! తలిదండ్రులగూర్చి తనకీ రోజున చావుగురించి ఆలోచన కలిగితే కలిగే వేదనకన్నపిల్లల గురించి....-జీవితం కురుక్షేత్రం. తండ్రి సారధి. కొడుకు రధికుడు.. అంటూండే వాడు తండ్రి. తనకోమారు టైఫాయిడు వచ్చింది. ఎన్నాళ్ళనీ..? చచ్చిపోతాడనే అనుకున్నారు. తనని తీసుకుపొమనీ బిడ్డను వదిలెయ్యమనీ దేవుడికి మొక్కుకున్నాడట. తల్లిప్రేమ తనకెందుకు



అంత గుర్తులేదూ?

భాస్కరం జ్ఞాపకాలలో కదులుతు ఉంటే రైలు సాఫీగా నడుస్తోంది.

తండ్రి గుర్తులు పెరుగుతున్న కొద్దీ రైలు వేగం తరుగుతోంది. ఆముసలి స్వరూపం బక్కచిక్కిపోయి మంచంమీద గుడ్డలమూటలా అయిపోయి తన యీశరీరాన్ని, మొహాన్నీ చూపటానికే కొన ప్రాణంతో ఉండి ఉంటుందా కొనచూపు అంటే జీవకళగల మొహంతోనా - నిర్జీవ కళేబరంతోనా?

ఊరు దగ్గరవుతోంది. ఆదుర్దా పెరుగుతోంది. రైలు మరింత నెమ్మదిగా నడిచింది. వెంటనే బస్సు దొరకలేదు! బస్సు దిగాక రిక్షా బేరం కుదరలేదు.

రిక్షా మలుపులు తిరుగుతోంది.

ఏ మలుపు తిరిగితే తను ఆటలాడిన ఇల్లు.. తండ్రి జోకొడుతూ ఎత్తుకుని పచార్లు చేసిన యిల్లు.. అల్లర్లు చేసి దెబ్బలుతిన్న ఏడుపులతో మారుమోగిన యిల్లు.. అయిల్లు కనిపించే ఆఒక్క మలుపూ రిక్షా తిరగటం లేదు.

ఆయింటిముందు వదిమంది ఉంటారా? ఎవరూ ఉండరా? తండ్రి మంచంమీద ఉంటాడా? నేలమీదా? తమ్ముళ్ళు వచ్చే ఉంటారా? వచ్చి ఉండరు..తనకన్న ముందు రారు -- అయినా ఏంటీ ఆలోచనలూ? ఆయనకేమీ అవదు. చనిపోడు. ఆయిన్ని చనిపోనివ్వడు. తన యావచ్ఛక్తులు వినియోగించి కాపాడుకుంటాడు. భూప్రపంచంమీద దొరికే ఉత్తమ వైద్యమంతా చేయిస్తాడు. తన సర్వస్వం తెగనమ్మేస్తాడు. ఆప్రాణిని బ్రతికించుకుంటాడు.. బ్రతికించుకుని..? ఊ. బ్రతికించుకుని?? ఎన్నాళ్ళు?

కొన్నాళ్ళు! కొన్నేళ్ళు!

ఆ తర్వాత..? ఆ తర్వాత..?

అంటే ఆగిపోతున్న జీవన చక్ర భ్రమణాన్ని తను తనదని భావించేఅద్భుత శక్తితో మరికొంతసేపు పొడిగించుతాడు-! అంటే ఆజీవి పడుతున్న యాతనను బాధను మరికొంతకాలం పెంచుతాడు! ఆ బాధలలో ఏ ఒక్కదాన్నీ తాను తగ్గించకపోగా -- తగ్గించలేకపోగా -- వాటికి మరికొంత బ్రతుకు యిస్తాడు. తను బ్రతుకునిచ్చేది తన తండ్రికి కాదు--! ఆ తండ్రి మూలుగులను పట్టిపీడిస్తున్న జబ్బులకు! ఎంత క్రూరత్వం ఎంత స్వార్థం ... ఎంత అహం..

నాన్నా! నాన్నా!

నీప్రయాణం పుట్టుకతో మొదలయింది. నువ్వు పడిపోతే నీతండ్రి లేవదీసి నడిపించి ఉంటాడు. నీవు గమ్యానికి చేరువగా ఉన్నావు. పాకుతున్నావు. నిన్నిప్పుడు నీ కొడుకులేపి కూర్చోబెడితే నీప్రయాణం పూర్తిగా ఆగిపోతుందా? హాయిగా సజావుగా ప్రయాణం పూర్తవటం వాంఛనీయం గాని.--


నాన్నా! నాన్నా!

నీవు వెళ్ళొద్దు! వెళ్ళటానికి వీల్లేదు. నన్ను వదలవద్దు. నేను వస్తున్నా! నీ జీవనజ్యోతిని ఎగసన దోస్తా!

రిక్షా ఆమలుపు తిరిగింది.

వీధరుగుమీద పేకాట సాడుతోంది. డ్రావ్‌చేసిన మనిషి రిక్షాను గమనించగానే

"అక్కా! బాబిగాడొస్తున్నాడే-" అంటూ అరిచాడు.




3

టెలిగ్రాం ఎప్పుడందింది? రైలు ఎప్పుడు దొరికింది? పిల్లల్ని తీసుకు రాలేదేం-? - యిలాంటి ప్రశ్నలన్నీ వీధిలోనే ఎదురవటంతో భాస్కరం పరిస్థితి సరిగానే ఉందనుకున్నాడు. గబగబా లోపలికి నడిచాడు. ముసిలాయనను మంచంమీద చూసేసరికి అతని కళ్ళలో నీళ్ళు తిరిగాయి. చూపులేదు. స్పృహలేదు. ఎగ ఊపిరి. దిగ ఊపిరిగా ఉంది. మూడురోజులయిందట మాటపోయి.

ఆమాట వింటూనే భాస్కరం గట్టిగా అన్నాడు-"యింత వరకూ నాకు టెలిగ్రాం ఎందుకు యివ్వలేదూ?"

ఆప్రశ్నకి తమ్ముడికి మామగారూ తనకి మేనమామా అయిన సుబ్బారావు జవాబిచ్చాడు.

"- అస్తమానూ కంగారుపడి కబురు పంపొద్దన్నాడు క్రితంసారి. "

షాక్ అయాడు భాస్కరం.

తండ్రికి తల్లి ఉంది. నడుం వింటి బద్దగా వంగిపోయింది. యావన్మందికి ఆవిడ మీద అంతులేని సానుభూతి. పన్నెండు మందిని ఆవిడ కన్నది. అంతా పుట్టా చావానూ. కడకు నలుగురు గడికట్టారు. వాళ్ళంతా మనవళ్ళెత్తారు. యీ ముసిలాయన ఒక్కడే మగనలుసు. మిగిలిన ముగ్గురూ ఆవిడ కళ్ళముందే వెళ్ళిపోయారు. భాస్కరం గొంతు వినగానే ఆవిడ ముందే షడుతూ లేస్తూ వచ్చింది.

"-వాళ్ళ మాటలకేంరా నాయనా? మోసేవాళ్ళు నువ్వూ మీ నాన్నానూ. వాడలా ఉన్నాడు. కాడి మోయాల్సినవాడివి. నిబరువు వాళ్ళు ఎత్తుకుంటారా? పదపద!" అంది- చెయ్యిపట్టుకుని.

తల్లి లోపల కాఫీల దగ్గర ఉంది.

నాయనమ్మ మనవడితో అక్కడికే నడిచింది. తల్లిని చూడగానే భాస్కరం కుప్ప కూలిపోయాడు. చేతిలో పంచదార డబ్బా పక్కనుంచి ఒచేయి కొడుకు భుజంమీద వేసి మరోచేత్తో పమిటకొంగు అడ్డుపెట్టుకుని సన్నగా ఏడవటం మొదలు పెట్టింది.

కొంచెం సర్దుకున్నాక వైద్యం గురించి అడిగాడు భాస్కరం. తల్లి సరిగ్గా చెప్పలేక పోయింది. నాడి దిగజారిపోవడంతో నలుగురికీ కబురుపంపాడట సుబ్బారావు. ఆయన ఊళ్ళోనే ఉంటున్నాడు. అంతా పరుగెత్తుకు వచ్చారు. అయితే ఎవరూ వైద్యంగురించి పట్టించుకోలేదు. నిమ్మకి నీరెత్తినట్టు పేకాటకి దిగిపోయారు. అంత దుఃఖంలోనూ వాళ్ళందరికీ కాఫీలు కలుపుతుంది తల్లి. - భాస్కరం చాలా కోపం వచ్చింది. కాఫీ తాగకుండ సైకిలు తీసుకుని పొరుగునున్న గావం బయల్దేరాడు. అఊళ్ళో వైద్యుడు ఉన్నాడు.

భాస్కరానికి ఊరిపొలిమేరలు దాటేదాకా నాయినమ్మే గుర్తువచ్చింది. ఎంత దురదృష్ట జీవి! ఎన్ని చావులు చూసింది! అంత దుఃఖంలోనూ ఆవిడ తల్లినీ మేనమామనీ గురించి పుల్లః రుపుగా మాట్లాడుతుంది.

తల్లి?

అరవై ఏళ్ళ వయసు ఆమెది. భర్తతో నలభై అయిదేళ్ళపైగా ప్రయాణించింది. భర్తతో ఆవిడ సుఖపడి ఉండదు. ఆవిడ స్త్రీ అన్న విషయం - స్త్రీ తనకన్న దిగువ మేధాస్థాయిగల ప్రాణి అన్నవిషయం - తండ్రి ఎప్పుడూ మరిచిపోలేదు. ఆమెని మరువనీయలేదు. తన ఆధునిక నేత్రాలకు ఆయిన ప్రవర్తన క్రూరంగా కన్పిస్తుందిగాని-- ఒంటిచేక్కమీద కుటుంబాన్ని మొయ్యటం, డబ్బు సంపాదించటంలోని కష్టం, కొన్ని విలువలు కోల్పోకుండా కొన్ని మర్యాదలు న్యాయంగా నడపటం ఆనాటి మగవాడికి కత్తిమీద సాములే! నికరాదాయాలూ, భార్యా భర్తా కుటుంబాలూ, మధ్యతరతగతి వారికి అందుబాటులోకి వస్తున్న వస్తు సామ్రగ్రి -- వీటన్నిటి కారణంగా -- యీనాటి మగవాడు భార్యకూ -- స్త్రీకి -- ఎక్కువ విలువను యిస్తున్నట్టు ఎక్కువ సుఖపరుస్తున్నట్టూ భావించుకునే అవకాశం వచ్చింది.

భాస్కరానికి యీతేడా కొంత అర్థమయింది. కాని తండ్రికన్నా తాను ఎక్కువ మానవత్వమూ, ఉదార స్వభావమూ విచికిత్సా గలవానిగా భావించే సుఖానికి లొంగిపోతుంటాడు: అందువల్లనే భాస్కరానికి తల్లి అంటే జాలీ తండ్రి అంటే గౌరవమూ స్థిరపడ్డాయి. ఆజాలి కారణంగానే అతనికి నాయనమ్మపట్ల కొంతకోపం ఉండేది. ఆయాభావాల తాలూకు తీవ్రత ఆయింటికీ మనుషులకూ ఎడంగా ఉంటూండటంతో కొంత సర్దుకుంటూ వచ్చింది. ఆరోజు తల్లినీ ఆ మామ్మనూ బేరీజు వేసుకుంటే వాళ్ళిద్దరిలో ఎవరిది పెద్దకష్టమో అతనికి తెలలేదు.

తండ్రి మరణం జరిగిపోయినట్లు వాళ్ళిద్దరూ కష్టంలో పడినట్లూ అనుకోటంలోని అమంగళమూ అతనికి నచ్చటంలేదు.


సైకిలు డాక్టరు యింటిముందు స్టాండు వేసాడు.

రాజారావు ఆయుర్వేద వైద్యుడు. అల్లోపతి నేర్చాడు. భాస్కరంకి ఆయనతో మాట్లాడితే పట్నండాక్టర్లతో మాటాడినట్లుండదు. శాస్త్రీయంగా సమస్యను పరిష్కరిస్తున్నట్లు తృప్తి కలగటానికి బదులు బండ పద్ధతిలో పోతున్నట్లు కించకలుగుతుంది. పోతే డాక్టర్లు ఉపయోగించే జబ్బులపేర్లూ చేసే టెస్టులూ ఓతృప్తినిస్తే -- రాజారావు మాటల్లోని ఆత్మీయత మరో తృప్తినిస్తుంది.

"అబ్బాయ్! నీప్రయత్నం నువ్వు చెయ్యొచ్చు. తప్పులేదు. నీయిష్టం..! యీగడ్డమీద పుట్టాడు. పదిమందికి అన్నం పెట్టాడు. ఊరంతటిచేతా బ్రహ్మరథం పట్టించుకున్నాడు. తనబిడ్డలని తనంత వాళ్ళని చేసాడు. ఎవరి బాధ్యతలూ మరొకరి మీద వదలలేదు. ఆజీవి కర్తవ్యం నిర్వహించాడు. ఆదీపం మలిగిపోక తప్పదు. ఒక జబ్బుకి మందుయిస్తే మరొకటి వస్తోంది. ఓమారు మనిషిని ఎత్తిచూడు. అన్నిగుడ్డలు వేసిన పట్టెల మచ్చలు ఎర్రగా కనిపిస్తున్నాయి. ఆ మహాతల్లికి విసుగులేకుండా చేస్తోంది. లేకపోతే యీపాటికి వుచ్చిపోయేవాడు. అయినా బెడ్‌సోర్స్. ఆక్కడికీ నిత్యమూ శుభ్రం చేస్తూనే ఉన్నాను. నీకూ మంచి చెడ్డా తెలుసు! రమ్మంటావా నేనూ వస్తాను. పెద్ద డాక్టర్లతో మాట్లాడతాను -"

భాస్కరానికి రాజారావు మాటలు సహించలేదు. యింత ముదిరేదాకా ఉంచేసి యిప్పుడు లాభంలేదంటాడేమిటి?- తమాయించుకున్నాడు.

మూడు నెలలక్రితం యిలాగే వచ్చింది. రాజారావే వైద్యం. అతన్ని విడవనన్నాడు తండ్రి. తనూ సరిగ్గా ప్రెస్ చెయ్యలేదు. అప్పుడే తల్లితో అన్నాడు -- "ఏమాత్రం కంగారయినా తెలియపరచు! అనవసరంగా ఆందోళన పడకూ-" అని. అప్పుడు వసంతా వచ్చింది. తనమాటను మరోలా తీసుకుని తల్లి మేనమామతో అన్నదో .. మేనమామే మరోలా తిప్పాడో .. యిప్పుడు తనమీదికే తిప్పికొట్టాడు. దెప్పి పొడిచాడు. ఆదెప్పిపోటు రాజారావుతో మాట్లాడుతుండగా గుర్తు వచ్చింది. తన కూతురిని తమ్ముడికి యిచ్చుకున్నాక మేనమామ ఆ చుట్టరికమే మరిచిపోయినట్టున్నాడు. తన అప్పగారిని దగ్గర చేసేకుందామన్న తాపత్రయమే - ఏదోమాట వేస్తూంటాడు. ఆవిడ వంటిమీద ఏభై కాసుల బంగారం ఉంది.



యువ్వుడు యీవై ్యని మాటవట్టుకుని ఏమీ చేయం పోతే మేనమామ దొరకబుచ్చుకోడా?

"-వెళ్ళొస్తాను మామయ్యగా ౹!"

వీధిమలుపుదాకా దిగబె ్టాడు రాజారావు. కంగారు పడవద్ద ్నాడు. యిలాంటప్పుడే మనిషి ఓర్చాలన్నా ౹.

భాస్కరం సైకిలు ఎక్కాడు.

టెలిగ్రాం అందుకున్న క్షణ నించీ ఎదురయిన ఆలోచనలూ -- మనుష లూ - వాళ్ళ తత్వాలూ అ నిలో కదలాడుతున్నాయి.

ఎంత అస్వతంత్రుడో ఆ కనికి అనుభూతమవుతోంది.

ఆ అస్వతంత్రతలో రెండు ్రధాన బేధాలున్నాయి.

మొదటిది జీవితం సృష్టిం నది. ఈజీవితంలో నిర్దుష్టతలేదు. ఏది ంచి? మంచిలో అనేక రకాలు. ఏది ప్రేమ ఏది కాదు? ఏది తర్కం? ఏది కు ర్కం? యీనాటి జీవితంలో ఉన్నంత వై ధ్యత కొన్నేళ్ళక్రితం ఉండేది కాదేమో! ఏ అనుబంధాన్ని నిలుపుకోవాలన్నా ఏ ాధ్యత నిర్వహించాలన్నా -- డబ్బు, కాలం, ారం- వంటి అవరోదాలు ఎన్నింటిని ఏ టాలి! ఫలితంగా అనుబంధాల బలంసన్న ్గినట్లు అనిపిస్తుంది. ఫలితంగా ునిషి స్వతంత్రంగా ప్రేమించనయినా ోనన్న అస్వతంత్రత.

రెండవది తనచుట్టూ మ ుషు ఆలోచనలూ తత్వాలూ అవసరాల నుంచి వచ్చినది. యిది బహుశా సృష్టి మొదటినుంచీ ఉన్నదేమో!

తను ఏం చేయాలి?

ఏం చేస్తే తను స్వతంత్రుడు? ఏంచేస్తే కాడు?

సైకి ు ఊరిని సమీపిస్తోంది.

అత కళ్ళముందు తల్లితండ్రీ కదులుతున్నా .

తాను ప్రయోజకుడినని ఋజువు చేసుకోవాల్సిన భావం కదులుతోంది.

> "నిన్న ఓ యువకుడు నన్ను తీవ్రంగా అవమానించాడు"
>
> "ఎందుకు? ఏమైంది?"
>
> "నీకు పాట పాడటం వస్తుందా అని అడిగాడు నన్ను"
>
> "ఇందులో అవమానకరమైన మాటే ముంది?"
>
> "ఒక పాట విన్న తరువాతే ఈ ప్రశ్న వేశాడు."
>
> 'బి.వి'

వెనకటి తరపు ఆశఅయిన పుట్టిన గడ్డ మీదనే మంగాలి - అన్న భావన మీద గౌరవం తరుగుతోంది.

సైకిలు స్టాండువేసి లోపలికి నడిచాడు భాస్కరం.

నాయనమ్మ గుమ్మంలోనే కాసింది.

"-ఏమన్నాడురా రాజారావు---?"

జవాబివ్వలేదు.

"-ఏరా, బాబిగా---ఏమంన్నా రాయనా?" అడిగింది తల్లి.

జవాబు తెలిసిన ప్రశ్నలు ఎందుకు వేస్తారూ-?

వీధిలోంచి మేనమామ గొంతు వినిపిస్తోంది.

"--పెద్దాయనా--? ఆయనకే మయ్యా సుబ్బయ్య కాపూ! పెద్దకొడుకు ప్రయోజకుడయాడూ -- రాజాలా తీసుకు వెళ్తాడు - అందరు డాక్టర్లకి చూపిస్తాడు.

తల్లికీ, నాయనమ్మకీ ఆమాటలు వినిపించే ఉంటాయి. తల్లి మొహంలో కాంతి కనిపిస్తోంది. ముసలమ్మ మనవడి దగ్గరకి వచ్చి చెయ్యిపట్టుకుంది -

"నాయన్నాయనా! నన్నూ వీడితోబాటే తీసుకు వెళ్ళరా! ఇంత బతుకూ బతికాను! యిప్పుడు నన్ను వీళ్ళు ఉచ్చులోబెట్టి పేడలో ఈడ్చేస్తారూ--" అంది గొంతు తగ్గించి.

భాస్కరం తూర్పువైపు వసారాలో చతికిలబడ్డాడు.

తల్లి పట్టుకువచ్చి కాఫీ అందించింది.

నాయనమ్మ కళ్ళనీళ్ళు పెట్టుకుంటూనేఉంది.

భాస్కరం ఎవరికీ జవాబివ్వలేదు. కాఫీగ్లాసు తల్లికి అందించాడు. వరసకి పినతండ్రులూ మేనమామలూ ఉషారుగా పేకాడుతున్నారు.

వాళ్ళంతా పల్లెటూరి మనుషులు!

అందువల్ల ఇన్ని ఆలోచనలూ వదుల్చుకోటానికే యీవిధంగా కాలక్షేపం చేస్తారా?

ఊళ్ళో మునసబువచ్చి తండ్రి క్షేమం విచారించాడు.

"-నీలాంటి కొడుకుండగా మీనాన్న కేమయ్యా-?" అన్నాడు.

భాస్కరం సర్వాంగాలూ బంధింప బడిపోతున్నట్లు ఫీలయాడు. బలవంతంగా నవ్వాడు.

ఊపిరి సలపటానికి భాస్కరం అరగంట పోయాక పేకాటలో కూర్చున్నాడు.

ఓ గంట గడిచింది.

జాక్‌పాట్‌లో ఫస్ట్ రౌండవగానే ఆట చూపించాడు. ఓ కుర్రాడిని పిలిచి సైకిలు యిచ్చాడు.

"రాగంపేట వెళ్ళి తెల్లారేసరికి టాక్సీ కావాలని చెప్పిరా!" అన్నాడు.

అలా అంటున్నప్పుడు ఆబందీ గొంతులో ఓ వింత గర్వం మెరిసింది.

